క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభం



గుంతల్లో గ్రావెల్ వదులుతున్న టిప్పర్లు

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరం నుంచి నర్సాపురం వైపు అర్ధంతరంగా నిలిచిన రోడ్డు విస్తరణ పనులు శనివారం తిరిగి ప్రారంభమయ్యాయి. టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తోలించి రోడ్డు పక్కన తీసిన గుంతల్లో వదులుతున్నారు. గుంతలు మీటర్ లోతు ఉండటంతో నిబంధనల ప్రకారం అర్ధ మీటర్ వరకు గ్రావెల్ వేసి చదును చేస్తున్నామని, ఆపై కంకర వేసి రోలర్లతో తొక్కిస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. గుంతలు పూడ్చుతుండటంతో ప్రజలు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థినికి అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం



డీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సంధ్య

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని సంధ్య శనివారం డీఈఓ జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం అవార్డును అందుకుంది. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు శనివారం తెలిపిన వివరాల మేరకు పాఠశాలలోని విద్యార్థులందరూ కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే సంధ్య ఇంటర్‌లో 945/1000 మార్కులు సాధించిందని చెప్పారు. శనివారం జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన 10, ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులను ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధికారుల చేతుల మీదుగా సత్కరించారన్నారు.

3,259 పాఠ్య పుస్తకాల మంజూరు



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో భద్రపరచిన పాఠ్య పుస్తకాలు

ఉయ్యాలవాడ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండవ విడత 3,259 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 6,589 అన్ని రకాల పాఠ్య పుస్తకాలు మండల స్టాక్ పాయింట్‌కు చేరాయని తెలిపారు. పాఠశాలలు జూన్12న పునః ప్రారంభం రోజు నాటికి విద్యార్థులకు కావాల్సిన పూర్తి స్థాయి పాఠ్య పుస్తకాలు, విద్యా సామగ్రి వస్తాయని చెప్పారు.

మాన్యం కౌలుకు వేలం



వేలాలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మండలంలోని కొత్తపల్లె గ్రామ ఆలయ మాన్యం కౌలుకు శనివారం వేలాలు నిర్వహించారు. స్థానిక రామాలయ సమీపంలో ఈఓ వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో 8వ సర్వే నంబర్లలోని 21.28 ఎకరాలకు వేలాలు నిర్వహించారు. గత ఏడాది రూ.3.20 లక్షలకు పోగా.. ప్రస్తుతం రూ.3.04 లక్షలు పలికనట్లు ఈఓ తెలిపారు. వ్యవసాయ ఖర్చులు పెరగడం, అకాల వర్షాలు, వాతావరణం అనుకూలించకపోవడం వంటి కారణాలతో రైతులు ఎక్కువ మొత్తం చెల్లించలేదని చెప్పారు. గ్రామ పెద్దలు సోమశేఖర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు పెంచాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికులకు కేటగిరీల వారీగా వివరాలు సేకరించి జీతాలు పెంచాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు భాస్కరాచారి, రంగనాథ్ కోరారు. శనివారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అధికారులు సమగ్రంగా చర్చించి కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. రామకృష్ణ, ఆదాం, బాల దుర్గన్న పాల్గొన్నారు.

ప్రమాదకరంగా థైరాయిడ్

- వయస్సుతో నిమిత్తం లేకుండా థైరాయిడ్ సమస్య
- జీవన శైలి మార్పులే కారణమంటున్న వైద్యులు
- శారీరక, మానసిక సమస్యలతో సతమతం
- జిల్లాలో 13 శాతం మంది బాధితులు
- స్త్రీలలోనే బాధితులు అధికం
- నేడు వరల్డ్ థైరాయిడ్ డే

గోస్పాడు: థైరాయిడ్ వ్యాధి అనేది మీ థైరాయిడ్ గ్రంధి పనితీరును ప్రభావితం చేస్తుంది. థైరాయిడ్ ప్రధాన విధి..శరీరంలో జీవక్రియ వేగాన్ని నియంత్రించడం. తీసుకునే ఆహారాన్ని శరీరం శక్తిగా మార్చే ప్రక్రియ. శరీరంలోని అన్ని కణాలు పనిచేయడానికి శక్తి అవసరం. థైరాయిడ్ గ్రంధి సరిగా పనిచేయనప్పుడు శరీరాన్ని మొత్తం ప్రభావితం చేస్తుంది. ఇది అన్ని వయస్సుల వారిని ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతం థైరాయిడ్ వ్యాధి వ్యాప్తి పెరుగుతోంది. వ్యాధి ఉన్నట్లు తెలియకపోతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మనిషిని మానసికంగా, శారీరకంగా కుంగదీసే ఈ వ్యాధిపై సమగ్ర అవగాహన అవసరం. మనిషి వికాస క్రమంలో థైరాక్సిన్ హార్మోన్ పాత్ర ఎంతో కీలకమైనదని వైద్యులు పేర్కొంటున్నారు. ఒక్కోసారి ఎలాంటి లక్షణాలు బయటపడక పోవచ్చు. రక్త పరీక్షలు చేస్తే తప్ప వ్యాధి నిర్ధారణ కాదని అలాంటి సమయాల్లో థైరాయిడ్ పరీక్షలు అవసరమని వైద్యులు చెబుతున్నారు. నేడు వరల్డ్ థైరాయిడ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

సీతాకోక చిలుక ఆకారంలో..

గొంతు ముందు భాగంలో శ్వాస నాళానికి ఇరుపక్కలా గులాబీ రంగులో సీతాకోక చిలుక ఆకారంలో థైరాయిడ్ గ్రంధి ఉంటుంది. ఇది శరీరంలోని చాలా జీవక్రియల్ని నియంత్రిస్తుంది. శరీరం, ఎముకల పెరుగుదల, శరీర ఉష్ణోగ్రత, మానసిక వికాసాన్ని అదుపు చేస్తుంది. వివిధ కణజాలాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ హార్మోన్ ఉత్పత్తికి మన శరీరంలో తగినంత అయోడిన్ అవసరం. దీర్ఘకాలికంగా ఉండే ఈ వ్యాధి ఒకసారి వస్తే జీవితాంతం మందులు వాడాల్సివస్తుందని, సంపూర్ణ అవగాహన, అప్రమత్తతతో వ్యాధిని జయించవచ్చు. థైరాయిడ్ రెండు రకాలుగా.. హైపర్, హైపోగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం రక్తంలో టీ–3, టీ–4, టీఎస్‌హెచ్ హార్మోన్లు ఎంతున్నాయో పరీక్షలు చేసి అందులో వచ్చే ఫలితం ఆధారంగా థైరాయిడ్‌ను నిర్ధారణ చేస్తారు.



వ్యాధి లక్షణాలు..

- ఈ వ్యాధి లక్షణాలు క్రమంగా బయటపడతాయి.
- ఈ వ్యాధి వచ్చిన వారిలో హుషారు తగ్గి, అంతకు ముందులేని మందకొడితనం చోటుచేసుకుంటుంది.
- విపరీతమైన అలసట, నడవాలన్నా, పనిచేయాలన్నా ఓపిక ఉండక సులభంగా అలసిపోవడం.
- చర్మంలో తడి, సునుపుదనం తగ్గి, ఎండిపోయినట్లు ఉంటుంది. చలికి, వేడికి తట్టుకోలేక పోవడం.
- కండరాలు ఉబ్బుతాయి. దానివల్ల శరీరం ఉబ్బుగా కనిపిస్తుంది. కొందరు ఉబ్బు కామెర్లుగా భ్రమపడే అవకాశం ఉంది.
- మలబద్ధకం, కండరాలు పట్టివేసినట్లు ఉండటం, చర్మం కింద కొవ్వు చేరి బరువు పెరగడం.
- గొంతు బొంగురుగా మారడం, ముఖం గుండ్రంగా కనిపించడం, మనిషి మందమతిగా మారడం.
- ఎముకల్లో కాల్షియం తక్కువై పెలుసుబారతాయి.
- తలమీద వెంట్రుకలు, కనుబొమ్మల వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి.
- పిల్లల్లో పెరుగుదల లోపాలు, శారీరక, మానసిక సమస్యలు
- లావు అవ్వడం, బరువు పెరగడం, మత్తు, ఒళ్లునొప్పులు, మలబద్ధకం వంటి సమస్యలు
- స్త్రీల రుతుచక్రంలో మార్పులు, గర్భం రావడం ఆలస్యం, వచ్చినా నెలలు నిండకుండానే కాన్పు కావడం, తరచుగా గర్భస్రావాలు వంటి లక్షణాలు గమనించవచ్చు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, 52 పీహెచ్‌సీలు, 16అర్బన్ హెల్త్ సెంటర్లు, 2 ఏరియా ఆస్పత్రులు, 11 సీహెచ్‌సీలు, 1 జిల్లా ఆసుపత్రి ఉన్నాయి. ఈ ఆస్పత్రుల ద్వారా ప్రతి రోజూ వందలాది మంది చికిత్స కోసం వైద్యులను సంప్రదిస్తున్నారు. జనరల్ ఫిజీషియన్‌తో పాటుగా ఇతర వైద్య నిపుణుల్ని రోజూ సంప్రదిస్తున్న బాధితుల సంఖ్య 70 నుంచి వంద మందికి పైగా ఉంటుందని అంచనా. జిల్లా ఆస్పత్రికి జనరల్ మెడిసిన్, గైనిక్ వైద్య విభాగానికి రోజూ వైద్యం కోసం వచ్చే వారిలో థైరాయిడ్ బాధితులు ఉంటున్నారు. 15 నుంచి 50 సంవత్సరాలలోపు మహిళల్లో 5 నుంచి పది శాతం, పురుషుల్లో ఒకటి నుంచి రెండు శాతం, 19 ఏళ్లలోపు వారిలో ఐదు శాతం, 50 ఏళ్లు పైబడిన వారిలో 13 శాతం ఈ వ్యాధి బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

వ్యాప్తి ఇలా..

- ఈ వ్యాధి అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని 90 ఏళ్ల వయస్సు వారికీ రావచ్చు.
- స్త్రీలలోనే ఎక్కువగా సమస్య తలెత్తుతుంది.
- జన్యుపర లోపాల వల్ల, తల్లికి ఉంటే బిడ్డకు వంశపారంపర్యంగా వస్తుంది.
- అప్పుడే పుట్టిన బిడ్డకు థైరాయిడ్ ఉందో లేదో నిర్ధారణ పరీక్ష చేయించడం ఉత్తమం.
- గర్భిణిగా ఉన్నప్పుడు సమస్యను గుర్తించక పోతే పుట్టబోయే బిడ్డకు భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం.

ఆహారపు అలవాట్లు ఇలా..

థైరాయిడ్ ఉన్న వారు రోజువారి ఆహారంలో మార్పులు చేసుకోవాలి. ఇప్పటికే వ్యాధితో బాధపడుతున్న వారు క్యాబేజీ, క్యాలీఫ్లవర్, పాలకూర, ముల్లంగి వంటి ఆకు, కూరగాయలను మితంగా తీసుకోవాలి. థైరాయిడ్ బాధితులు ఐదారు మాసాలకొకసారైనా రక్త పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

అశ్రద్ధ వద్దు



థైరాయిడ్ వ్యాధి పట్ల అశ్రద్ధ కూడదు. లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. మహిళలు, చిన్న పిల్లల పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. సరైన సమయంలో చికిత్స తీసుకోవాలి. వ్యాధి సోకినా ఒక్కోసారి లక్షణాలు కనిపించవు. లక్షణాలు ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటాయి. యాంటీబాడీ టెస్ట్ చేయించుకోవడం ద్వారా వ్యాధి వచ్చే అవకాశం ఉందా, లేదా అనే విషయాన్ని ముందుగానే తెలుసుకోవచ్చు. చికిత్స కోసం వచ్చే గర్భిణులకు థైరాయిడ్ పరీక్షలు చేయిస్తున్నాం. ఐదు నుంచి పది శాతం మహిళలు వ్యాధి బారిన పడుతున్నారు. సరైన సమయంలో చికిత్స చేయించుకుంటే ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ పద్మజ, హెచ్ఓడీ, గైనకాలజీ విభాగం, ప్రభుత్వాసుపత్రి, నంద్యాల

కేంద్ర పథకాన్ని పక్కాగా అమలు చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల అభ్యున్నతికి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తి ఆభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్–2025 పథకాన్ని పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను శనివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించబడే ఈ కార్యక్రమంపై గిరిజనులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో విస్తృత ప్రచార అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ పథకం ద్వారా గిరిజన ప్రాంత సముదాయాల్లో సురక్షిత గృహనిర్మాణం, శుభ్రమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, పోషకాహారానికి మెరుగైన ప్రాప్యత, విద్యుత్ సరఫరా, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగ ప్రచారం, రహదారి, టెలికాం కనెక్టివిటీ వంటి రంగాలపై విస్తృత పరిషత్ విస్తృత ప్రచారం కల్పిస్తూ సంబంధిత అంశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే.. జిల్లాలోని గిరిజనులకు ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్ మరియు జన్ ధన్ అకౌంట్లను తప్పనిసరిగా ఇప్పించాలన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి



విద్యార్థులకు అంబేడ్కర్ అవార్డు అందజేస్తున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సంఘాలు పేద విద్యార్థుల అభ్యుతికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, మానసిక వైద్య నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎస్పీజీ హైస్కూల్‌లో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కార అవార్డులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ విద్య ద్వారానే మనిషికి విలువ, గౌరవం లభిస్తుందన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లలో అత్యధిక మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులను అభినందించడం సంతోషకరమన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చింతామణి, హెచ్ఎం జీవలత, సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి రవికుమార్, సుజిత్, ఆనంద్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వీడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: మండలంలో సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడాలని, విధి నిర్వహణలో ఎక్కడికెళ్లినా మినిట్స్ పుస్తకంలో సమాచారాన్ని నమోదు చేయాలని ఎంపీపీ వీరభద్రుడు సూచించారు. మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాలలో సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని పలు మార్లు దిన పత్రికలలో వార్తలు వచ్చాయన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఎంపీడీఓకు మెమోలు పంపడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సమాధానం కోరగా.. సంజాయిషీ కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రతి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విధులకు గైర్హాజరైన వారిపై కలెక్టరుకు ఫిర్యాదు చేసి, సదరు ఉద్యోగి జీత భత్యాలు నిలుపుదల చేయిస్తామన్నారు.

రేషన్ ఇంటి వద్దకే చేర్చాలి



మాట్లాడుతున్న అనిల్ అమృతరాజ్

బొమ్మలసత్రం: పేదల సౌకర్యార్థం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ చేసే ప్రక్రియను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్ కోరారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాల వద్ద సరుకుల కోసం వేచి చూడకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే సరుకుల పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారన్నారు. ఐదేళ్ల పాటు ఈ వాహనాల ద్వారా ప్రజలు సరుకులు ఇంటి వద్దే తీసుకున్నారు. ఈ ప్రక్రియకు ఎంతో ఆదరణ లభించిందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే వారికి మద్దతుగా పోరాటం చేసేందుకు పూనుకుంటామన్నారు. క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు కారు రవికుమార్, నాయకుడు డాక్టర్ మనోజ్ పాల్గొన్నారు.

ఇళ్ల రీసర్వేను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

నంద్యాల(న్యూటౌన్): 20శాతం పెంపు కోసం చేపట్టిన భవన కొలతల రీసర్వేను వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, పుల్లా నరసింహులు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇంటి విస్తీర్ణ కొలతలు తక్కువగా ఉన్నాయన్న సాకుతో పట్టణాలు, నగరాల్లో నివాస, వాణిజ్య భవనాల రీసర్వే పేరిట ఇంటి కొలతలు తీసుకోవాలని నిర్ణయం తీసుకోవడం అప్రజాస్వామ్యకమన్నారు. ఈ సర్వే ద్వారా రూ.463 కోట్లు ప్రజలపై భారం పడుతుందన్నారు. ఆస్తి పన్ను మరో 15శాతం పెరగనుందన్నారు. ఇల్లు నిర్మిస్తే 50శాతం ఫెనాల్టీ విధిస్తున్నారని, ఇంటికి ప్లాన్ లేకపోయినా, ఉండి అదనపు అంతస్తు వేసినా దానికి మరో వంద శాతం ఆస్తి పన్ను పెనాల్టీగా వేస్తున్నారన్నారు. పెంచిన పన్ను నిబంధనను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని,వెంటనే అమలు చేయాలిన డిమాండ్ చేశారు. నాయకులు తోటమద్దులు, వెంకటలింగం, బాలవెంకట్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చాగలమర్రి: మండలంలోని రాంపల్లె మెట్ట వద్ద జాతీయ రహదారిపై మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడటంతో పెద్ద బోధనం గ్రామానికి చెందిన గడ్డ సుబ్బారాయుడు(31) మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గడ్డ సుబ్బారాయుడు ప్రతి రోజులాగే కొలిమి పని చేయడానికి పెద్ద బోధనం నుంచి బైక్‌పై ఆళ్లగడ్డకు బయలుదేరాడు. రాంపల్లె మెట్ట వద్దకు వెళ్లడానికి కుడి నుంచి ఎడమ వైపునకు వెళ్లే క్రమంలో మోటారు సైకిల్ అదుపు తప్పి కిందపడటంతో సుబ్బారాయుడు తలకు గాయమైంది. గ్రామస్తులు టోల్ ప్లాజాకు చెందిన అంబులెన్సులో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ షేక్ అబ్దుల్ నబి తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు సంతానం.

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి సమాధి తప్పదు

- చంద్రబాబు హామీలు నమ్మి ప్రజలు మోసపోయారు
- వెంటనే ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయింది
- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తదితరులు

చాగలమర్రి: వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో టీడీపీకి ప్రజలు సామాధి కట్టి సమాధానం చెబుతారని వైఎస్సార్‌సీపీ ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఆయన శనివారం చాగలమర్రిలోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ మండల ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ కుమారుడు మహమ్మద్ ఆరీఫ్ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడతూ.. 2024 ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు చంద్రబాబునాయుడుకు ఓట్లు వేసి గెలిపించి బాధపడుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు ప్రజల్లో తిరగడానికి అవకాశం ఉంటుందన్నారు. అలా కాకుండా హామీలను గాలికొదిలేస్తే ప్రజలు తిరుగుబాటు చేస్తే వవరూ ఆపలేరన్నారు. విద్యార్థులకు ఇవ్వవలసిన విద్యాదీవెనపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తే మే నెలలో చెల్లిస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదన్నారు. మినీ మహానాడులో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పదవుల కోసం తీర్మానాలు చేయడం కాదని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చటానికి తీర్మానాలు చేయాలని అధికార పార్టీ ఎమ్మెల్యేకు సూచించారు.

ప్రజలకు అన్నీ తెలుసు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పంచాయతీ నిధుల విడుదలకు కమీషన్లు, అహోబిలంలో జరుగుతున్న దౌర్జన్యం, ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో 50 శాతం తక్కువకు పంచాయతీ గేట్లు వేలంపాటలో దక్కించుకొని అంతులేకుండా వసూళ్లకు పాల్పడటం ప్రజలందరికి తెలుసని మాజీ ఎమ్మెల్యే అన్నారు. అంతే కాకుండా చికెన్ షాపులలో కేజీకి రూ.30లు కమీషన్ వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే అధికారులతో దాడులు చేయించి షాపులను మూయించి పేదవారి కడుపుల కొడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాలను నిలిపివేయడం అప్రజాస్వామికం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే ఆ పట్టాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య అని గంగుల అన్నారు. నిరు పేద ప్రజల పక్షాన నిలబడి న్యాయ పోరాటం చేస్తామన్నారు. కడపలో కోవిడ్ కేసులున్నాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు సోషియల్ మీడియా ద్వారా సమాచారం ఇస్తే, ప్రభుత్వం మాత్రం టీడీపీ మహానాడు జరుగుతుండటంతో కోవిడ్ కేసులేవని చేప్పడం ప్రజల ఆరోగ్యం పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి ఏ మాత్రమో అర్థమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్.బాబులాల్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, వ్యాపారవేత్త చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, ఎంపీపీలు వీరభద్రుడు, గజ్జల రాఘవేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ ముల్లా రఫి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, పార్టీ ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల మంజూరు

శిరివెళ్ల: మండలానికి జీలుగ విత్తనాలు మంజూరయ్యాయని ఏఓ సుధాకర్ శనివారం తెలిపారు. మొదటి విడత కింద 526 క్వింటాళ్లు మంజూరయ్యాయన్నారు. డిమాండ్ బట్టి మరో 300 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తామన్నారు.

622 మంది విద్యార్థులు గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన జీవశాస్త్రం పరీక్షకు 622 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 35 పరీక్ష కేంద్రాల్లో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీవశాస్త్రం పరీక్షకు 2,624 మంది విద్యార్థులకు గాను 2002 మంది హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఐదు పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఓపెన్ పది పరీక్షల్లో భాగంగా సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్షకు నాలుగు కేంద్రాల్లో 114 మంది విద్యార్థులకు గాను 95 మంది హాజరు కాగా 19 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే ఓపెన్ ఇంటర్మీడియెట్ పరీక్షల్లో జీవశాస్త్రం, వాణిజ్య, వ్యాపార, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్ష రెండు పరీక్ష కేంద్రాల్లో 123 మంది విద్యార్థులకు గాను 107 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

మద్యపానంతో అనేక నష్టాలు



మాట్లాడుతున్న నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ

గోస్పాడు: మద్యపానం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లేశ్వరి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో మద్య పానం వల్ల కలిగే నష్టాలపై డాక్టర్లు, సిబ్బందికి అవగాహన సమావేశాన్ని జనరల్ ఆసుపత్రి మానసిక వ్యాధుల నిపుణులు ఇక్రాముల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ మే 24న స్కిజోఫ్రీనియా అవగాహన దినోత్సవం సందర్భంగా మద్యపానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. మద్యపానం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు పలు ఆర్థికమైన సమస్యలతో పాటు లివర్, గుండె, కిడ్నీ, మెదడు వంటి సమస్యలతో కుటుంబం విచ్చిన్నమవుతుందని, మానసికంగా, నైతిక విలువలు కోల్పోవాల్సి వస్తుందని వివరించారు. ఇలాంటి సమస్యలతో బాధపడే వారికి నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్ ద్వారా మద్యం మానుకొనేలా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, జనరల్ మెడిసిన్ డాక్టర్ రమేష్, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద హోమం చేస్తున్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని మందలూరులో నూతనంగా నిర్మించిన ఈశ్వర, వీరభద్రస్వామి ఆలయాల్లో శనివారం గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు పునర్నిర్మించి ధ్వజ ప్రతిష్ట గావించారు. కార్యక్రమాలు చేపట్టి 40 రోజులు అయిన సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తుల విగ్రహాలను అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించడంతో పాటు స్వామి వారి సన్నిధిలో హోమ గుండాల వద్ద పూజలు చేశారు.

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

మాన్యం భూములకు పెరిగిన ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో నిర్వహించిన మాన్యం భూముల కౌలువేలం పాటల్లో ఆలయానికి ఆదాయం పెరిగినట్లు ఈఓ బాల చెంచన్న తెలిపారు. శనివారం గ్రామంలోని శ్రీగౌరిభోగేశ్వరస్వామి ఆలయాని చెందిన 46 ఎకరాలు, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ 44.14 ఎకరాల మాన్యం భూముల కౌలుకు వేలం పాట నిర్వహించగా రూ.22.12లక్షలకు రైతులు దక్కించుకున్నారన్నారు. గతేడాది రూ. 20.14లక్షలకు పాడగా మొత్తం రూ.1.98 లక్షలు ఆదాయం పెరిగినట్లు చెప్పారు. డీసీ ఉపాధ్యక్షుడు వెంకటనాయుడు, గోపాల్ నాయుడు, మాజీ ఆలయ ధర్మకర్త నారాయణ స్వామి, శేషప్ప, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.